

ప్రతిపాదనల్లోనే అంతర్రాష్ట్ర డిపో!

భద్రాచలంలో ఆర్టీసీ అంతర్రాష్ట్ర డిపో ఏర్పాటుపై నాలుగు రాష్ట్రాల ప్రజలకు ఎంతో కాలంగా ఎదురుచూపులు తప్పడం లేదు. 8లో



జిల్లా పోలీసులకు రివార్డులు

గంజాయి రవాణా కేసుల్లో నేరస్తులకు శిక్ష పడేలా చార్జిషీట్లు దాఖలు చేసిన పోలీసులకు డీజీపీ జితేందర్ రివార్డులు అందజేశారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 28° / 17°

జిల్లాలో ఆదివారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగానే ఉంటాయి. రాత్రి, తెల్లవారు జామున చలి తీవ్రత పెరుగుతుంది.

సినిమా ఖిల్లాపై అడవుల జిల్లా !



సండే స్పెషల్

కనుచూపు మేర అందమైన అడవులు
మరెక్కడా కానరాని అరుదైన జంతుజీవాలు
పెట్టని కోటల్లా ఉన్న గుట్టలు
చూపు తిప్పుకోనివ్వని జలాశయాలు
సంప్రదాయాన్ని వీడని ఆదివాసీల గూడేలు
దేశానికి వెలుగులు అందించే పరిశ్రమలు

ఇవీ జిల్లాకు సహజసిద్ధంగా అమరిన అందాలు.. ఏళ్ల క్రితమే ఇక్కడ పలు సినిమాల చిత్రీకరణ జరిగింది. చిత్రాలకు కావాల్సిన అందమైన లోకేషన్లు ఉన్నప్పటికీ నటీనటులు, ఇతర బృందం బస చేసేందుకు మాత్రం సరైన వసతులు లేవు. దీంతో కొన్నేళ్ల పాటు చిత్రీకరణల కోసం ఎవరూ ఇటుచూడలేదు. ప్రస్తుతం తెలుగు సినిమా ఎల్లలు చెరుపుకుంటూ పాన్ ఇండియా పేరుతో దేశం నలుమూలలా చుట్టేస్తోంది. కొత్త కథలను తెరపై ఆవిష్కరించేందుకు పల్లెలు, అడవుల బాట పడుతోంది. తెలంగాణ ఏర్పడ్డాక ఇది మరింత విస్తృతం కావడంతో ప్రకృతి రమణీయత సొంతమైన జిల్లాలో ఆతిథ్య రంగానికి సంబంధించి వసతులు కల్పిస్తే సినిమా షూటింగ్‌లకు జిల్లా సరికొత్త అడ్డా కానుంది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

గతంలోనే ఇక్కడ జోరుగా సినిమా షూటింగ్‌లు

- ఏళ్ల క్రితమే కిన్నెరసానిలో ఆడిపాడిన సీనియర్ ఎన్టీఆర్
- తెలంగాణ ఏర్పడ్డాక మళ్లీ ఇటువైపు సినిమాల చూపు
- మౌలిక సదుపాయాలు కల్పిస్తే జోరందుకోనున్న చిత్రీకరణలు

50 ఏళ్ల క్రితం నుంచే..

50 ఏళ్ల కిందటే 'అందాలరాముడు' పేరుతో భద్రాచలం వద్ద గోదావరిలో అక్కినేని నాగేశ్వరరావు హల్‌చల్ చేశారు. ఆ తర్వాత కొన్నేళ్లకే కిన్నెరసాని డ్యామ్‌పై ఎన్టీ రామారావు చిందులు తొక్కారు. వాళ్లు చూపిన బాటలోనే నడుస్తూ బాలకృష్ణ, నాగార్జున, వెంకటేశ్, చిరంజీవి, మోహన్‌బాబు, ఆర్.నారాయణమూర్తి, జగపతిబాబు నటించిన కొన్ని సినిమాల షూటింగ్ ఇక్కడ జరిగింది. మధ్యలో బాలీవుడ్ బాద్‌షా షారూఖ్‌ఖాన్ సైతం కొత్తగూడెం బొగ్గు గనుల్లో కెమెరా ముందు చెమటలు చిందించాడు. అంతకుముందు రెబల్‌స్టార్ కృష్ణంరాజు 'చెయ్యెత్తి జైకొట్టు' అంటూ బొగ్గు గనుల నేపథ్యంలో వెండితెరపై విప్లవాన్ని రగిలించారు. ఇలా సినిమా షూటింగ్‌లకు సంబంధించి జిల్లాకు 50 ఏళ్లకు పైగానే చరిత్ర ఉంది. జూనియర్ ఆర్టిస్టులు మొదలు అగ్రతారల వరకు అనేకమంది నటీనటులు ఇక్కడికి వచ్చి ఆడి పాడారు. రాబోయే రోజుల్లో మరింతగా వచ్చేందుకు అవకాశం కూడా ఉంది. అయితే అందుకు తగ్గట్టుగా జిల్లాలో ఆతిథ్య రంగంలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉంది.

అవకాశాలు పుష్కలం..

పచ్చటి అడవులు, పొగలు విరజిమ్మే పరిశ్రమలు, చెమటలు చిందించే కార్మికులు, గలగలమంటూ పారే నదులు, కొండలు, గుట్టలు, వాటి చుట్టూ పెనవేసుకున్న గిరిజనుల జీవితాలు, చారిత్రక, ఆధ్యాత్మిక నేపథ్యం పెనవేసుకున్న ప్రదేశాలు.. ఇలా ఒకే చోట అనేక విభిన్నతలకు జిల్లా నెలవుగా ఉంది. అందుకే రవాణా సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు అంతంతమాత్రంగానే ఉన్న రోజుల్లోనూ చెన్నై, ముంబై నుంచి సినిమా యూనిట్‌లు ఇక్కడికి వచ్చి షూటింగ్‌లు జరుపుకున్నాయి. పరిశ్రమ పూర్తిగా హైదరాబాద్‌కు మారిన తర్వాత ఇక్కడ షూటింగ్‌లు తగ్గిపోయాయి. హైదరాబాద్‌లోనే సకల సౌకర్యాలు ఉండడంతో సెట్లలోనే చిత్రీకరిస్తున్నారు. అయితే తెలంగాణ ఏర్పాటు తర్వాత ఇక్కడి ప్రాంతీయత, సంస్కృతి, జీవన విధానాన్ని వెండితెరలో బంధించడం ఎక్కువైంది. దీంతో సినిమా క్రూలు స్టూడియోలను దాటి తిరిగి ఔట్ డోర్ బాట పడుతున్నాయి. ఈ క్రమంలో హైదరాబాద్ దాటితే వరంగల్ తర్వాత భద్రాద్రి జిల్లానే బెస్ట్ ఆప్షన్‌గా ఉంటుందనేది కాదనలేని సత్యంగా రుజువవుతోంది.

మరికొన్ని విశేషాలు..

- పాల్వంచ పెద్దమ్మగుడి వెనుక ప్రాంతంలో ఒకప్పుడు దట్టమైన అడవులు ఉండేవి. ఈ గుట్టపైన 1974లో చలం హీరోగా భూమికోసం సినిమా షూటింగ్ జరిపారు. ఈ సినిమాతోనే జయప్రద సినీ రంగానికి పరిచయమయ్యారు.
- ఖమ్మం జిల్లాకు చెందిన వెటరన్ హీరో సత్యేంద్ర కుమార్ నటించిన 'ఛాయ' సినిమా షూటింగ్ కిన్నెరసాని, భద్రాచలం , ఖమ్మంలో జరిగింది.
- అడవిలోఅన్న సినిమా షూటింగ్‌ను మోహన్‌బాబు పర్ణశాలలో నిర్వహించారు. ఈ సినిమాలోని 'వందనాలమ్మా' పాట ఎంతో పాపులర్ అయింది.

మార్పులు తెస్తే మరింత ఊపు..

జిల్లాలో షూటింగ్‌లు జరిపేందుకు సినిమా యూనిట్లకు ఆసక్తి ఉన్నప్పటికీ ఆతిథ్య రంగంలో కనీస స్థాయిలో సదుపాయలు లేకపోవడం లోటుగా మారింది. ఆచార్య సినిమా షూటింగ్ సందర్భంగా జిల్లాకు వచ్చిన చిరంజీవి, రామ్‌చరణ్, కొరటాల శివకు అప్పటి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ స్వయంగా తన ఇంట్లో ఆతిథ్యం ఇవ్వాల్సి వచ్చింది. జిల్లాలో ఇటు ప్రభుత్వ, అటు ప్రైవేట్ రంగాల్లో కనీసం త్రీ స్టార్ సౌకర్యాలు కలిగిన హోటళ్లు లేవు. భద్రాచలం చుట్టూ ఎకో టూరిజం విస్తరించినప్పటికీ ఆశించిన స్థాయిలో గైడ్లు, ట్రాన్స్‌పోర్ట్ సర్వీసులు అందుబాటులో లేవు. ఇక్కడి పర్యాటక, ప్రకృతి అందాలను బయటి ప్రపంచానికి పరిచయం చేసేందుకు చక్కని కాఫీ టేబుల్ బుక్ కూడా లేదు.

విమానాశ్రయం వస్తోంది..

రాబోయే రోజుల్లో కొత్తగూడెంలో విమానాశ్రయం అందుబాటులోకి వస్తే హైదరాబాద్‌తో కనెక్టివిటీ మరింతగా పెరుగుతుంది. దీంతో ఎక్కువ మంది ఇక్కడికి వచ్చేందుకు ఆసక్తి చూపిస్తారు. అందుకు తగ్గట్టుగా జిల్లా కేంద్రమైన కొత్తగూడెం – పాల్వంచతో పాటు భద్రాచలంలో ఆతిథ్య రంగంలో మరిన్ని మార్పులు రావాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ఏళ్ల తరబడి నిర్మాణాలకే పరిమితమైన హరిత కాకతీయ హోటల్(కొత్తగూడెం), కిన్నెరసాని కాటేజీలను త్వరగా అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు. భద్రాచలంలో ప్రస్తుతం ఉన్న హోటళ్లను ఆధునీకరించడంతో పాటు ఇక్కడి సంస్కృతి ఉట్టిపడేలా చేపట్టనున్న మట్టి ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలి.

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, పక్కన ఎంపీ బలరామ్ నాయక్, కలెక్టర్ పాటిల్, ఎమ్మెల్యేలు తెల్లం, ఆదినారాయణ



రామాలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- ప్రజా సమస్యలపై నిబద్ధతతో పని చేయాలి
- పెండింగ్ పనులపై దృష్టి పెట్టండి
- అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధిపై ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ మేరకు నిధులు మంజూరు చేశామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం భద్రాచలం పర్యటనకు వచ్చిన ఆయన మొదట స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలికి శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి సన్నిధిలో వేదాశీర్వచనం చేసి స్వామి వారి జ్ఞాపిక, ప్రసాదం అందజేశారు. మంత్రి పొంగులేటి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. మాఢ వీధుల విస్తరణ, భూసేకరణకు ఇప్పటికే రూ.68 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. ఈ ప్రక్రియ అనంతరం ఆలయ అభివృద్ధికి తగిన నిధులు విడుదల చేస్తామని తెలిపారు. భద్రాచలంపై సీఎం రేవంత్‌రెడ్డికి అభిమానం ఉందని, అందుకే ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ఇక్కడి నుంచే ప్రారంభించారని గుర్తు చేశారు.

సమస్యలు పరిష్కరిస్తేనే మన్ననలు..

ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు నిబద్ధతతో పని చేస్తేనే వారి మన్ననలు పొందగలుగుతారని పొంగులేటి అన్నారు. స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీలో గిరిజనుల అభివృద్ధి, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. బీటీ రోడ్లు, చెక్ డ్యామ్‌లు, గిరిజన రైతులకు త్రీఫేస్ విద్యుత్ లైన్, మిషన్ భగీరథ, తాగునీటి సరఫరా వంటి పనులేమైనా పెండింగ్‌లో ఉంటే వెంటనే ప్రారంభించాలని ఆదేశించా రు. మారుమూల గ్రామాల్లో చేపట్టిన పనులకు అటవీ, ఇతర శాఖల అనుమతులు సత్వరమే తీసుకుని పనులు పూర్తయ్యేలా పర్యవేక్షించాలని సూచించారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని, ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని అన్నారు. చర్ల మండల కేంద్రంలో డయాలసిస్ సెంటర్ పనులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. ఎంపీ పోరిక బలరామ్ నాయక్ మాట్లాడుతూ చర్ల, దుమ్ముగూడెం, వెంకటాపురం మండల కేంద్రాల్లో డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని ఇందిరమ్మ రాజ్యంగా మార్చేందుకు అధికారులు సమష్టిగా పనిచేయాలని కోరారు. సమావేశంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, డీడీ మణెమ్మ పాల్గొన్నారు.



మంత్రి పొంగులేటికి వేదాశీర్వచనం చేస్తున్న రామాలయ అర్చకులు

ఆదివాసీ వంటకాలు అదరహో !

ఆదివాసీ సంప్రదాయ వంటకాల రుచులు అదరహో అన్నట్టుగా ఉన్నాయని మంత్రి పొంగులేటి అన్నారు. హౌసింగ్ గెస్ట్‌హౌస్‌లో మధ్యాహ్న భోజనం ఏర్పాటుచేయగా.. ఆదివాసీల వంటకాలైన కారం వాడకుండా వండిన మటన్, నాటుకోడి కూర, ఆకుకూర పప్పు, అడవి కాకరకాయ చంచల కూర, గంగవాయిల కూర, ఎండు చేపల పులుసు, బొద్దుకూర, పచ్చి మిరపకాయల పచ్చడి, గటక అన్నం, అంబలి, పెసరపప్పు, చేపల ఫ్రై తదితర వంటకాలను వడ్డించారు. ఎలాంటి కల్తీ, కల్మషం లేని వంటకాలు బాగున్నాయని గిరిజన మహిళలను మంత్రి అభినందించారు.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన వేడుక వైభవంగా జరిగింది. తెల్లవారుజామున అంతరాలయంలో మూలమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన స్వామి వారిని పల్లకీ సేవగా బేడా మండపంలో కొలువుదీర్చారు. అక్కడ అర్చకులు ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ , దారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ తంతును కనులపండువగా జరిపించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ద్విభాషా పాఠ్యపుస్తకాలపై సర్వే



మాట్లాడుతున్న బాలమురళి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని బాబూక్యాంపు ప్రభుత్వ పాఠశాలలో శనివారం ద్విభాషా పాఠ్య పుస్తకాలపై సర్వే నిర్వహించారు. సర్వే నిర్వాహకులు, డైట్ కళాశాల లెక్చరర్ బాలమురళి మాట్లాడుతూ అభిప్రాయాలను సేకరించి, క్రోడీకరించి నివేదికను హైదరాబాద్‌లోని రాష్ట్ర విద్యా శిక్షణ సంస్థకు పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.నీరజ, ఉపాధ్యాయులు షేక్ దస్తగిరి, చందర్‌రావు, భీమా, సునందిని, రమాదేవి, సరోజిని, సౌందర్య, ఉషారాణి, పుష్పారాణి, రాజేశ్వరి పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించాలి

భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయమూర్తి శివనాయక్



అధికారులతో మాట్లాడుతున్న జడ్జి శివనాయక్

భద్రాచలంఅర్బన్: డిసెంబర్ 14న జరుగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు రాజీ పడేలా చూడాలని భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయమూర్తి శివనాయక్ అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకుని భద్రాచలం కోర్టులో భద్రాచలం, దుమ్ముగూడెం, బూర్గంపాడు మండలాల పోలీసులు, భద్రాచలం ఎక్సైజ్, రెవెన్యూ శాఖల అధికారులు, న్యాయవాదులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్, మోటారు వాహనాల కేసులు రాజీ అయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్, భద్రాచలం పట్టణ సీఐ సంజీవరావు, దుమ్ముగూడెం సీఐ అశోక్, బూర్గంపాడు ఎస్ఐ రాజేష్, భద్రాచలం ట్రాఫిక్ ఎస్ఐ మధుప్రసాద్, భద్రాచలం ఎక్సైజ్ సీఐ రహీమున్నీసా బేగం, ఎఫ్ఆర్ఓ రంజిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించాలి

డీఈఓ వెంకటేశ్వరా చారి



మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరాచారి

భద్రాచలంటౌన్: పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు పరీక్షించాలని డీఈఓ ఎం.వెంకటేశ్వరా చారి అన్నారు. స్థానిక విద్యా వనరుల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకుని చదివించాలన్నారు. ప్రతీ రోజు బయోమెట్రిక్ హాజరు నమోదు చేసి లిస్ట్‌ను తమ కార్యాలయానికి పంపించాలని సూచించారు. 100 శాతం ఫలితాలు సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో ప్లానింగ్ కో–ఆర్డినేటర్ ఎస్.సతీష్ పాల్గొన్నారు.

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు ఫీజు షెడ్యూల్ విడుదల..

కొత్తగూడెంఅర్బన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులైన డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీలో లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలు వచ్చే జనవరిలో జరుగుతాయని, హాజరయ్యే అభ్యర్థులు దరఖాస్తు చేసుకుని, ఫీజు చెల్లించాలని డీఈఓ వెంకటేశ్వరాచారి శనివారం ఒక ప్రకటనలో సూచించారు. వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని, ఆ డాక్యుమెంట్‌ను తమ కార్యాలయంలో సమర్పించాలని, ఎలాంటి అపరాధ రుసుము లేకుండా డిసెంబర్ 3 వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. డ్రాయింగ్ లోయర్ పరీక్షకు రూ.100, హయ్యర్ పరీక్షకు రూ.150, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్ పరీక్షకు రూ.150, హయ్యర్ పరీక్షకు రూ.200 చొప్పున ఫీజులు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. రూ.50 అపరాధ రుసుముతో డిసెంబర్ 10వ తేదీ లోగా, రూ.75 అపరాధ రుసుముతో 17వ తేదీ లోగా ఫీజులు చెల్లించవచ్చని తెలిపారు. వివరాలకు 99890 27943 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రూ.500 బోనస్ జమ చేస్తున్నాం

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో వానాకాలం సీజన్‌లో 1,61,511 ఎకరాల్లో వరి సాగైందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి.బాబూరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో సన్నాలు 1,54,193 ఎకరాలు, దొడ్డు రకాలు 7,317 ఎకరాల్లో సాగు చేశారని, ధాన్యం కొనుగోలుకు జిల్లాలో 160 కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అన్ని కేంద్రాల్లో సన్న, దొడ్డు రకాల ధాన్యం విడివిడిగా కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 4,027 క్వింటాళ్ల సన్నరకం ధాన్యం కొనుగోలు చేస్తామని, క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని వివరించారు. నిబంధనలు పాటిస్తూ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని రైతులను కోరారు.

ముష్టి గింజలతో కాసుల పంట

- ధర భారీగా పెంచిన జీసీసీ
- కిలో రూ.45 నుంచి రూ.75కు పెంపు
- సేకరించే ఆదివాసీ, గిరిజనులకు అధిక లాభాలు
- సేకరణ లక్ష్యం నిర్దేశించిన అధికారులు



జీసీసీ ఇల్లెందు బ్రాంచ్ కార్యాలయం


ఇల్లెందు: అటవీ ఉత్పత్తుల ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. తాజాగా అడవి నుంచి సేకరించే ముష్టిగింజల ధరలు గణనీయంగా పెంచారు. గిరిజన సహకార సంస్థ ద్వారా డీఆర్ డిపోలు ఈ ముష్టిగింజలు కొనుగోలు చేస్తుంటాయి. కిలో ధర రూ.45 ఉండగా దీన్ని రూ.75కు పెంచారు. దీంతో ముష్టి గింజలు సేకరిస్తే కాసుల పంట పండనుంది. జీసీసీ భద్రాచలం డివిజన్ పరిధిలో ఐదు బ్రాంచ్‌లు ఉన్నాయి. ఇందులో భద్రాచలం, మణుగూరు, పాల్వంచ, ఇల్లెందు, దమ్మపేట ఉండగా 149 డీఆర్ డిపోలు ఉన్నాయి. ముఖ్యంగా ఇల్లెందు డిపో పరిధిలో 8 మండలాలు ఉండగా గుండాల, ఆళ్లపల్లి, టేకులపల్లి, బయ్యారం మండలాల పరిధిలో ఈ ముష్టి గింజల ఉత్పత్తి ఉంది. ఈ మండలాల పరిధిలోని డీఆర్ డిపోల పరిధిలో ముష్టి గింజల సేకరణ సాగుతోంది. ఇక భద్రాచలం డివిజన్ పరిధిలోని మణుగూరు బ్రాంచ్ పరిధిలో పినపాక మండలంలో కూడా ముష్టిగింజల సేకరణ ఉంటుంది. పాల్వంచ, దమ్మపేట మండలాలలో పాక్షికంగానే లభ్యమవుతాయి.

3 వేల క్వింటాళ్ల లక్ష్యం..

జీసీసీ పరిధిలో ఈ దఫా సుమారు 3 వేల క్వింటాళ్ల ముష్టిగింజలను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. నవంబర్ నుంచి జనవరి వరకు ముష్టి గింజలు లభిస్తాయి. చెట్లు నరకకుండా వీలైనంతగా కింద పడిన ముష్టి కాయలను సేకరించి అందులోని గింజలను వెలికి తీసి ఆరబెట్టి డీఆర్ డిపోలకు తరలిస్తే కిలోకు రూ.75 చెల్లిస్తారని జీసీసీ అధికారులు చెబుతున్నారు. గిరిజనులు ముఖ్యంగా అడివిపై ఆధార పడి జీవనోపాధి పొందే ఆదివాసీలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచిస్తున్నారు. కేవలం నిత్యావసర సరుకులు, హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలలకు సరుకులు సరఫరా చేసే జీసీసీ.. అటవీ ఉత్పత్తుల సేకరణపై దృష్టి సారించింది. ఇప్పటికే ఆయా బ్రాంచ్‌ల పరిధిలోని సేల్స్‌మెన్‌లతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సీజన్‌లో అడవుల్లో లభించే ఉత్పత్తుల సేకరణలో నిమగ్నం కావాలంటూ లక్ష్యాన్ని నిర్దేశించారు. కాగా, ఈ గింజలను పురుగుమందుల తయారీలో ఉపయోగిస్తారని అధికారులు వెల్లడించారు.

అడవే వారికి ఉపాధి..

అనాదిగా ఆదివాసులకు అటవీ సంపద వరం లాంటిది. అటవీ ఉత్పత్తుల సేకరణలో ఆటుపోట్లను ఎదుర్కొని ఆదాయాన్ని సమకూర్చుకోవటం ఆనవాయితీ. ఏటా పోడు వ్యవసాయం పెరిగి అడవులు తరిగిపోతుండడంతో వాటిపై ఆధారపడిన వారు భారీగా ఆదాయాన్ని కోల్పోతున్నారు. ఆదివాసీలు సేకరించే అటవీ ఉత్పత్తులకు మెరుగైన ధర అందించి దళారుల బెడద లేకుండా గిరిజన సహకార సంస్థ(జీసీసీ) కొనుగోలు చేస్తోందని అధికారులు ప్రకటించారు. అటవీ ఉత్పత్తులపై ఆధారపడిన గిరిజనులకు ఆదాయం చేకూర్చడం కోసం జీసీసీ డీఆర్ డిపోలలో కొనుగోలు చేపట్టిందని తెలిపారు.



ముష్టి గింజలు

సద్వినియోగం చేసుకోవాలి..



మునుపెన్నడూ లేనంతగా ముష్టిగింజల ధర పెరిగింది. గతంలో కిలో ధర రూ.45 ఉండగా ప్రస్తుతం రూ.75కు పెంచుతూ గిరిజన సహకార సంస్థ (జీసీసీ) నిర్ణయం తీసుకుంది. ముష్టిగింజలు సేకరించి లాభాలు పొందే మార్గం ఉంది. ఈ అవకాశాన్ని ప్రతీ గిరిజనుడు, ఆదివాసీ సద్వినియోగం చేసుకోవాలి. డీఆర్ డిపోలలో కొనుగోలు చేసిన వెంటనే పైకం చెల్లిస్తారు. సేకరించిన గింజలను ఎండలో ఆరబెట్టి గట్టిపడిన గింజలను తీసుకొచ్చి అత్యధిక లాభాలు ఆర్జించాలి.

– నర్సింహారావు, జీసీసీ ఇల్లెందు బ్రాంచ్ మేనేజర్

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని దక్షిణ భారతదేశ ఏటీఏఆర్ఐ – జోన్ 10 డైరెక్టర్ డాక్టర్ షేక్ మీరా పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయం – అనుసరించాల్సిన పద్ధతులపై కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. పంటల సాగులో ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించాలని అన్నారు. గోమూత్రం, జీవామృతం, బీజామృతం, వేపనూనె వంటివి వినియోగించాలన్నారు. కేవీకే శాస్త్రవేత్తల సలహాలు, సూచనలను పాటించాలని, వారి సేవలు సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జమునారాణి మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువులు వాడకాన్ని తగ్గించి, ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని అన్నారు. కార్యక్రమంలో సహాయ విస్తరణ సంచాలకులు డాక్టర్ ఆర్.ఉమారెడ్డి, కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ వి లక్ష్మీనారాయణమ్మ, శాస్త్రవేత్తలు డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ బి శివ పాల్గొన్నారు.

దాడి ఘటనలో కేసు నమోదు

పాల్వంచ: గేదెలు కట్టేసిన విషయంలో గొడవ పడి దాడి చేయడంతో శనివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని అయ్యప్పనగర్‌కు చెందిన యర్రం సామ్రాజ్యం ఇంటి పక్కనే ఉన్న స్థలంలో గేదెలు కట్టేసింది. దీంతో అజ్మీర బాబు నాయక్, అతని భార్య ప్రమీళ, కొడుకు ఉపేంద్ర నాయక్‌లు మరికొందరితో వచ్చి గొడవ పడి దాడి చేశారు. బాధితురాలు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

ప్రతిపాదనల్లోనే అంతర్రాష్ట్ర డిపో!

- ఏడు నెలలు గడిచినా కదలని తెలంగాణ-ఒడిశా ఆర్టీసీల ఒప్పందం
- భద్రగిరి నుంచి దూరప్రాంతాల సర్వీసులను తగ్గిస్తున్న అధికారులు
- ప్రయాణికులకు దూరమవుతున్న భద్రాచలం డిపో ప్రగతి రథచక్రం


భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్

భద్రాచలం: భద్రాచలంలో ఆర్టీసీ అంతరాష్ట్ర డిపో ఏర్పాటుపై నాలుగు రాష్ట్రాల ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నారు. కానీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతోపాటు భద్రాచలం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే సర్వీసులను తగ్గిస్తున్నారు. కొన్ని సర్వీసులను కుదిస్తున్నారు. దీంతో ఆర్టీసీ ప్రయాణికులకు దూరమవుతోంది.

నాలుగు రాష్ట్రాలకు అనుసంధానంగా ఉన్నా..

దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం పుణ్యక్షేత్రానికి దేశ నలుమూలల నుంచి భక్తులు తరలివస్తుంటారు. ప్రధానంగా ముక్కోటి, శ్రీరామనవమి ఉత్సవాల వేళల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న గిరిజనులు వైద్య సేవల కోసం భద్రాచలమే ఎక్కువగా వస్తుంటారు. పలు వ్యాపార కార్యకలాపాలకు గిరిజన, గిరిజనేతరులు వచ్చిపోతుంటారు. ఇంతటి ప్రాముఖ్యత కలిగినా భద్రాచలానికి అంతర్రాష్ట్ర డిపో గుర్తింపు కలగానే మిగిలిపోయింది. మరోవైపు ప్రైవేట్ వాహనాలు, బస్సుల యజమానులు ప్రయాణికుల అవసరాన్ని ఆసరా చేసుకుని రూ.వేలల్లో ఆదాయం కొల్లగొడుతున్నారు. ప్రభుత్వరంగ బస్సులు లేకపోవడంతో పేద, మధ్య తరగతి ప్రయాణికులు ఇబ్బందులు పడుతూ ప్రైవేటు వాహనాలపైనే ఆధారపడుతున్నారు.

నిర్లక్ష్యం వీడని ఇరురాష్ట్రాల అధికారులు

తెలంగాణ, ఒడిశాల నడుమ బస్సులు నడపాలని ఏడు నెలల క్రితం ఒప్పందం కుదిరింది. జగదల్‌పూర్ నుంచి భద్రాచలం, హైదరాబాద్‌లకు ఇరు రాష్ట్రాల నుంచి చెరో బస్సు తిప్పాలని నిర్ణయించారు. ఇరురాష్ట్రాల ఆర్టీసీ ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో ఒప్పందం ప్రతిపాదన దశలోనే ఆగిపోయింది. రాష్ట్రస్థాయిలో తీసుకోవాల్సిన నిర్ణయం కావడంతో జిల్లా ఆర్టీసీ అధికారులు సైతం ఏమి చేయలేమని చేతులు ఎత్తేస్తున్నారు. భద్రాచలం-ఛత్తీస్‌గఢ్ మార్గంలో ఆర్టీసీ బస్సులకు విపరీతమైన డిమాండ్ ఉన్నా సర్వీసులు లేవు. రవాణా కోసం ప్రైవేట్ వాహనాలనే ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో ప్రయాణికుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

భద్రాచలం-హైదరాబాద్ సర్వీసులు తగ్గిపోతున్నాయి..

భద్రాచలం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే సర్వీసులను తగ్గిస్తుండటంతో ప్రగతి రథచక్రం ప్రయాణికులకు దూరమవుతోంది. గతంలో మద్రాసుకు భద్రాచలం డిపో నుంచి వెళ్లే సర్వీసును రద్దు చేశారు. ఇక బెంగళూరుకు సైతం బస్సుల సంఖ్య పెంచాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. హైదరాబాద్‌కు ఇటీవల ఏసీ స్లీపర్ బస్సులను ప్రవేశపెట్టినా ప్రయాణికుల రద్దీగా తగిన సంఖ్యలో సర్వీసులు లేవు. దీంతో ప్రైవేట్ బస్సులు పదుల సంఖ్యలో పెంచి ప్రయాణికుల జేబులను కొల్ల గొడుతున్నారు. భద్రాచలం నుంచి హైదరాబాద్ వెళ్లే సర్వీసులను కూడా తగ్గిస్తున్నారు. గతంలో భద్రాచలం నుంచి కేపీహెచ్‌బీ, బీహెచ్ఈఎల్, ఈసీఎల్ వరకు బస్సులను నడిపేవారు. మెట్రో రైలు వల్ల ఆదరణ తగ్గిందనే కారణంతో ఆ సర్వీసులను కేవలం ఎంజీబీఎస్ డిపో వరకే పరిమితం చేశారు. భద్రాచలం-శ్రీశైలం సర్వీసును సైతం కుదించే యత్నాల్లో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. సర్వీసులు, వసతులు పెంచి ప్రయాణికులను ఆకట్టుకోవాల్సిన అధికారులు, పలు కారణాలతో బస్సుల రద్దు, కుదింపు పేరుతో అనాలోచిత నిర్ణయాలను తీసుకోవడంపై ఆర్టీసీ ప్రయాణికులు, భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రస్థాయి అధికారులు దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల పరిశీలనలో ఉంది

తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల నడుమ ఒప్పందం ఇంకా ఉన్నతాధికారుల పరిశీలనలోనే ఉంది. ప్రయాణికుల విజ్ఞప్తిని మరోమారు నివేదిస్తాం. మెట్రో రైలు సర్వీసుల రాక, ట్రాఫిక్ సమస్యలతో బీహెచ్ఈఎల్, కేపీహెచ్‌బీలకు ఆలస్యమవుతుండటంతో ప్రయాణికులు దూరమవుతున్నారు. అందువల్లే సర్వీసులను కుదించాం. భక్తులు, ప్రయాణికులు కోరిన దృష్ట్యా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటాం.

-బి.తిరుపతి, భద్రాచలం ఆర్టీసీ డిపో మేనేజర్

నేడు సీనియర్ ఆర్చరీ జట్ల ఎంపిక పోటీలు

కొత్తగూడెంటౌన్: ఉమ్మడి జిల్లాస్థాయి సీనియర్ పురుషులు, మహిళల ఆర్చరీ జట్లను ఎంపిక చేసేందుకు ఆదివారం పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్చరీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పుట్టా శంకరయ్య తెలిపారు. పాల్వంచ మండలం కిన్నెరసానిలోని స్పోర్ట్స్ స్కూల్‌లో వివిధ విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు ఆధార్ కార్డుతో ఉదయం 9గంటలకల్లా రిపోర్ట్ చేయాలని సూచించారు. వివరాలకు 93946 43139 (శంకరయ్య), 89194 23555(ఎస్.బాలసుబ్రమణ్యం), 70755 27214 (జి.మారప్ప)ను సంప్రదించాలని కోరారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ పోటీలు


విజేతలకు బహుమతులు అందిస్తున్న మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల, డీవైఎస్‌ఓ పరంధామ రెడ్డి

పాల్వంచ: పాల్వంచ శ్రీనివాస కాలనీ మినీ స్టేడియంలో శనివారం అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అండర్-8 బాల, బాలికల అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. అండర్-8,10, 12 బాల, బాలికల విభాగాల్లో 50, 100, 300, 400, 600 మీటర్ల పరుగు పందేలతోపాటు లాంగ్ జంప్, షాట్‌పుట్ పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలను రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, డీవైఎస్‌ఓ పరంధామ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వీరు డిసెంబర్ 1న మంచిర్యాలలో జరిగే రాష్ట్ర సబ్ జూనియర్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక చేశారు. అనంతరం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జి.యుగంధర్ రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో కె.మహీధర్, వై.వెంకటేశ్వర్లు, రాంప్రసాద్, కె.మహేందర్, సింధు తపస్వీ, నాగేంద్ర, గిరి, కృష్ణ, కాంగ్రెస్ నాయకులు యర్రంశెట్టి ముత్తయ్య, పులి సత్యనారాయణ, కందుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్షయ నివారణ కేంద్రంలో పరిశీలన


సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కర్

భద్రాచలంఅర్బన్: ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని క్షయ వ్యాధి నివారణ కేంద్రాన్ని శనివారం డీఎంహెచ్‌వో భాస్కర్ నాయక్ సందర్శించారు. వార్డులో ఉన్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం సీబీన్యాట్ ల్యాబ్‌లో రికార్డులను పరిశీలించారు. ఏఆర్టీ సెంటర్‌ను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు డాక్టర్ బాలాజీ నాయక్, డాక్టర్ మధువరుణ్ పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాల విద్యార్థుల ప్రతిభ


అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన అశ్వారావుపేట విద్యార్థులు

అశ్వారావుపేటరూరల్: ప్రొఫెసర్ జయశంకర్ సార్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ కళాశాల క్రీడా పోటీల్లో అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. ఈ నెల 19వ తేదీ నుంచి 22వ తేదీ వరకు జరిగిన పోటీల్లో రాష్ట్రంలోని 11 వ్యవసాయ కళాశాలల నుంచి క్రీడాకారులు తరలిరాగా, అశ్వారావుపేట కళాశాల నుంచి 30 మంది బాలురు, 20 మంది బాలికలు పాల్గొన్నారు. బాలికల విభాగంలో రచన, బాలుర విభాగంలో కె.అనిల్ కుమార్ వ్యక్తిగత అథ్లెటిక్స్ చాంపియన్‌లుగా నిలిచారు. టెన్నికాయిట్ క్రీడలో విజేతలుగా ఎస్ నందిత, శ్రీలేఖ, ఆర్.కల్యాణి, టెబుల్ టెన్నిస్‌లో పి.అమృత వర్ష, వై.యమున, హెచ్.చిన్నారి, చెస్‌లో ఎండీ ఇషాథైసిన్ గెలుపొందారు. బాలుర విభాగం టెబుల్ టెన్నిస్‌లో కె.అబ్రహం, ఆర్.చంద్రశేఖర్, బ్రహ్మజ్ఞ విజేతలుగా నిలిచారు. అథ్లెటిక్స్ విభాగంలో ఆర్.రచన 100, 200, 400 మీటర్ల పరుగు పందేల్లో, లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానం, హైజంప్‌లో తృతీయ స్థానం కైవసం చేసుకుంది. కావ్యశ్రీ హైజంప్‌లో ప్రథమ స్థానం, 200 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం, 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో, జావెలిన్ త్రో విభాగంలో ప్రథమ స్థానం సాధించింది. 400 మీటర్ల పరుగు పందెంలో అకిత ప్రథమ స్థానంలో నిలిచారు. బాలుర విభాగంలో కె.అనిల్ కుమార్ 1500, 800, 400, 200 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం, 100 మీటర్లలో తృతీయ స్థానంలో, జోష్ కృష్ణ 800 మీటర్ల విభాగంలో ప్రథమ స్థానం, లక్ష్మీ నరసింహ ద్వితీయ స్థానంలో, 1500 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానంలో, జావెలిన్ త్రో విభాగంలో రాహుల్ గౌడ్ ప్రథన స్థానం కైవసం చేసుకున్నారు. క్రీడా పోటీల్లో విజేతలు, రన్నర్స్‌గా నిలిచి బహుమతులు సాధించిన విద్యార్థులను కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్, బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

జిల్లా పోలీసులకు డీజీపీ రివార్డులు


డీజీపీ జితేందర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న ఎస్‌ఐ రాణా ప్రతాప్

కొత్తగూడెంటౌన్/టేకులపల్లి/జూలూరుపాడు : గంజాయి అక్రమ రవాణా కేసుల్లో నేరస్తులకు శిక్ష పడేలా విధులు నిర్వహించిన జిల్లా పోలీసులకు శనివారం హైదరాబాద్‌లో డీజీపీ డాక్టర్ జితేందర్ రివార్డులు అందజేశారు. 2023లో 480 కేజీల గంజాయి అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు ముద్దాయిలకు పదేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధించారు. ఇందుకు కృషి చేసిన భద్రాచలం సీఐ నాగరాజు రెడ్డి, ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ సుధీర్, టేకులపల్లి మండలం బోడు ఎస్సై పోడిశెట్టి శ్రీకాంత్, జూలూరుపాడు ఎస్సై రాణాప్రతాప్ తదితరులకు రివార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కాగా, రివార్డు సాధించిన పోలీసులను ఎస్పీ రోహిత్‌రాజ్ అభినందించారు.

నారేప దుంగలు స్వాధీనం

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లు అటవీ సెక్షన్ పరిధి పాపకొల్లు బీట్-బీలో నారేప దుంగలను అటవీశాఖ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 17న అటవీ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, రాసగానిగుట్టపై చెట్లు నరుకుతున్న దుండగులు గమనించి పారిపోయారు. అక్కడ నరికి ఉన్న రూ. 70 వేల విలువైన ఐదు నారేప కలప దుంగలను అటవీశాఖ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. సెక్షన్ ఆఫీసర్ మల్లయ్య, బీట్ ఆఫీసర్ విజయలక్ష్మి దుంగలను కొత్తగూడెం అటవీ డిపోకు తరలించారని, ఈ ఘటనపై విచారణ చేపట్టామని జూలూరుపాడు ఎఫ్ఆర్ఓ జి.ప్రసాద్‌రావు తెలిపారు.

రోడ్డు ప్రమాద ఘటనపై కేసు నమోదు

పాల్వంచరూరల్: రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనం ఢీకొని మాళోతు లక్ష్మణ్(45) మృతిచెందిన సంఘటనపై శనివారం కేసు నమోదుచేశారు. పోలీసుల కథనం ప్రకారం .. మండల పరిధిలోని కేశవాపురం గ్రామానికి చెందిన మాళోతు లక్ష్మణ్ కిరాణం దుకాణానికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో పాల్వంచ నుంచి భద్రాచలం వైపు వెళ్తున్న బైక్ ఢీకొనడంతో మృతిచెందాడు. మృతుడి కుమార్తె బానోతు వాణిశైలు ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన పాల్వంచ పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన ఎండీ.మసూద్ రెహమాన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

లైసెన్స్ లేకుండా పత్తి కొంటే కఠిన చర్యలు


టేకులపల్లిలో జరిమానా వసూలు చేస్తున్న సిబ్బంది

టేకులపల్లి: లైసెన్స్ లేకుండా పత్తి కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బాణోతు రాంబాబు అన్నారు. మార్కెట్ కమిటీ పరిధిలోని టేకులపల్లి, గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో లైసెన్సులు లేకుండా కొనుగోలు చేపడుతున్న చిల్లర కొంటర్లపై మార్కెట్ కమిటీ సిబ్బంది శనివారం దాడులు నిర్వహించారు. కొంటర్లు నిర్వహిస్తున్నవారి నుంచి జరిమానా వసూలు చేశారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్-3 కార్యదర్శి ఇ.నరేష్‌కుమార్, సిబ్బంది రంజిత్, మధు పాల్గొన్నారు.